డిన్నర్‌కని తీసుకెళ్లి యువతిపై అత్యాచారం

బంజారాహిల్స్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): డిన్నర్ చేద్దామని యువతిని ఓయో గదికి తీసుకెళ్లి అత్యాచారం చేసిన జొమాటో డెలివరీ బాయ్‌ని పోలీసులు అరెస్టు చేశారు. నగరానికి చెందిన ఓ యువతి (23) ఎనిమిది నెలల క్రితం ఓ సైన్స్ కాన్ఫరెన్స్‌కు హాజరైంది. ఆకలి కావడంతో జొమాటోలో ఆహారం ఆర్డర్ చేసింది. జొమాటోలో డెలివరీ బాయ్‌గా పనిచేసే ఓబెదుల్లా ఖాన్ ఆమెకు ఆహారం ఇచ్చాడు. డబ్బును గూగుల్ పే ద్వారా చెల్లించింది. ఈ సమయంలో ఇద్దరి మధ్య ఫోన్ నెంబర్ల మార్పిడి జరిగింది. తరుచూ ఫోన్‌లో మాట్లాడుకునే వారు. కలిసేవారు. ఇదిలా ఉండగా ఈనెల 27న యువతిని ఓబెదుల్లా ఖాన్ కలిశాడు. ఇద్దరు కలిసి పలు చోట్ల తిరిగారు. డిన్నర్ చేసుకుంటూ మాట్లాడుకుందామని యువతిని బంజారాహిల్స్‌లోని ఓయో రూంకు తీసుకెళ్లాడు. కొద్ది సేపు మాట్లాడుకున్న తర్వాత యువతిపై అత్యాచారం చేశాడు. ఈవిషయం బయటకు చెప్పవద్దని చెప్పాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఓబెదుల్లా ఖాన్‌పై సెక్షన్ 376, 354(ఎ), 354(డి)ఐపీసీతో పాటు ఐటీ యాక్ట్ 66(ఈ) కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తామని మోసం

యుసుఫ్‌గూడ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను ఇద్దరు యువకులు మోసం చేశారు. నిరుద్యోగులు నుంచి దాదాపు రెండు లక్షల వరకు కాజేశారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... షేక్ వాజిద్ అనే యువకుడు వెంగళరావునగర్‌లోని హాస్టల్‌లో తన మిత్రులు వినోద్, లక్ష్మణ్‌తో ఉంటూ చదువుకుంటున్నాడు. వీరికి హాస్టల్‌లో ఉంటున్న పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతానికి చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి అనంతపురం ప్రాంతానికి చెందిన సిద్ధార్థ్‌ను పరిచయం చేశాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, కొంత నగదు చెల్లించాలని సిద్ధార్థ్ వారితో చెప్పాడు. దీంతో గత ఏడాది సెప్టెంబర్ 15న వినోద్ రూ. 20వేలు, 21వ తేదీన వాజిద్ రూ. 10వేలు ప్రవీణ్‌కు పంపారు. డబ్బు తీసుకొని నకిలీ ఆఫర్ లెటర్లు వారికి అందజేశాడు. అంతే కాకుండా వినోద్, లక్ష్మణ్ తరచూ పెద్ద మొత్తంలో ప్రవీణ్‌కు, సిద్ధార్థ్‌కు దాదాపు రూ. 2 లక్షల వరకు ఇచ్చారు. డిసెంబర్ వరకు వీరికి ఎలాంటి జాయినింగ్ లెటర్ ఇవ్వలేదు. దీంతో అనుమానం వచ్చిన స్నేహితులు సిద్ధార్థ్‌ను, ప్రవీణ్‌ను నిలదీయగా వారికి మాయ మాటలు చెబుతూ మీ డబ్బులు తిరిగి ఇస్తామని నమ్మించారు. పదేపదే డబ్బులు అడగడంతో తమను వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేయడంతో పాటు మళ్లీ బెదిరింపులకు పాల్పడడంతో విసుగు చెందిన బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారి ఇంట్లో వజ్రాభరణాలు చోరీ

బంజారాహిల్స్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వ్యాపారి ఇంట్లో వజ్రాభరణాలు చోరీ అయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లో నివసిస్తున్న యష్‌లల్వాని వ్యాపారి. ఫిబ్రవరి 2న ఆయన తల్లి బీరువాలో వజ్రాలతో కూడి బంగారు నెక్లెస్‌తో పాటు వజ్రాల చెవికమ్మలు పెట్టింది. వివాహ వేడుకకు వెళ్లేందుకు అదే నెల 12న బీరువా తెరిచి చూడగా ఆభరణాలు కనిపించలేదు. సీసీ కెమెరాలు పరిశీలించగా ఇంట్లో పనిచేసే బిహార్‌కు చెందిన సాహెబ్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని ప్రశ్నించగా.. సరైన సమాధానం చెప్పలేదు. దీంతో యష్ లల్వాని బంజారాహిల్స్ పోలీసులకు ఈనెల 28న ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బంజారాహిల్స్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో డివైడర్‌పై పడి ఓ యువకుడు మృతి చెందాడు. కిషన్‌బాగ్‌కు చెందిన యాకూబ్‌ఖాన్ కారు డ్రైవర్. కుమారుడు ఇమ్రాన్ ఖాన్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఈ నెల 28న ఇమ్రాన్ ఖాన్(15)ఇంట్లో ఉండగా ఏసీ మెకానిక్ అయిన స్నేహితుడు హలీముద్దీన్ వచ్చాడు. ఏసీ మెకానిక్ కోసం తాను మౌలాలి వెళ్తున్నట్టు చెప్పి ఇమ్రాన్ కూడా రావాలని కోరాడు. తండ్రి వారిస్తున్న వినకుండా ఇమ్రాన్ స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. కొంత దూరం వెళ్లాక హలీముద్దీన్ తన వాహనాన్ని ఇమ్రాన్‌కు నడిపించేందుకు ఇచ్చాడు. ఇద్దరూ కలిసి రోడ్డు నెంబరు 1కి రాగానే వెనకాల నుంచి ఓ ద్విచక్ర వాహనం వేగంగా వీరి పక్క నుంచి వెళ్లింది. ఈ దాటికి ఇమ్రాన్ నడుపుతున్న వాహనం అదుపు తప్పి డివైడర్‌కు ఢీ కొట్టింది. ఇమ్రాన్ డివైడర్‌పై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని మహవీర్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించిన బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ ఉద్యోగి ఆత్మహత్య

అల్వాల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల కారణంగా హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. అల్వాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన ప్రహ్లాద్‌కుమార్(40)కు అదే ప్రాంతానికి చెందిన శుభశ్రీతో వివాహం అయింది. వీరికి ఒక బాబు. ప్రహ్లాద్‌కుమార్ కొన్నేళ్లుగా హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తూ అక్కడే క్వార్టర్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. భార్యభర్తల మధ్య తరుచుగా గొడువలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వీరికి ఫ్యామిలీ కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. అయినా గొడవపడుతున్నారు. గురువారం రాత్రి దంపతులు ఇద్దరూ గొడవపడ్డారు. మనోవేదనకు గురైన ప్రహ్లాద్‌కుమార్ రాత్రి 11.30 గంటల సమయంలో ఇంట్లో బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

గాజులరామారం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాంగ్‌రూట్‌లో వచ్చిన గుర్తు తెలియని వాహనం వృద్ధుడిని ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. నిజాంపేట్ విలేజ్‌కి చెందిన వెంకటరమణ(67) జీడిమెట్లలోని తన కుమారుడు అజయ్‌కుమార్ కార్యాలయానికి ఈనెల 27న బయలు దేరాడు. మార్గ మధ్యలో కైసర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ అపార్టుమెంట్ సమీపంలో గుర్తు తెలియని వాహనం వెంకటరమణని ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలు కాగా, గచ్చిబౌలిలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం కుమారుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

గాజులరామారం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మానసిక పరిస్థితి సరిగా లేని మహిళ ఇంటి నుంచి బయటికెళ్లి తిరిగి రాలేదు. శ్రీరామ్‌నగర్‌కు చెందిన నవజ్యోతిసింగ్ ఇంటికి ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అత్త సుర్జిత్‌కౌర్(38) ఈనెల 23న వచ్చింది. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి సదరు మహిల బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు సూరారం పోలీసులకు అల్లుడు నవజ్యోతి సింగ్ ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జవహర్‌నగర్‌లో వ్యక్తి..

జవహర్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పనికోసం వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌వో నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్టలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న పల్లెబోయిన శివప్రసాద్(35) బాలాజీనగర్‌లో వెంకటేశ్వర దేవాలయం సమీపంలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ఈనెల 27వ తేదీన పనికి వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించక పోవడంతో భార్య పుష్ప పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు

- మరమ్మతులు చేయాలని వినతి
- ఇబ్బందుల్లో బీకేగూడ, రవీందర్‌నగర్ కాలనీ వాసులు



బీకేగూడ, రవీందర్‌నగర్ అంతర్గత రోడ్ల పరిస్థితి

సనత్‌నగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్ బీకేగూడ రవీందర్‌నగర్ కాలనీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. డ్రైనేజ్, వాటర్ వర్క్స్ అధికారులు తమ పనులు, మరమ్మతులు చేయడానికి ఎక్కడ పడితే అక్కడ రోడ్లను తవ్వడం వల్ల రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్లు వేసి ఎన్నో సంవత్సరాలు కావడంతో వర్షానికి రోడ్డుకు ఇరువైపులా కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారాయి. రోడ్డు తవ్వి పనులు పూర్తయిన తర్వాత దాన్ని పట్టించుకోకపోవడంతో గుంతలు ఏర్పాడ్డాయి. ఈరోడ్లపై నీరు నిలవడం, గుంతలు పడడంతో ఈ మార్గాల గుండా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని ప్రధాన రహదారులు చక్కగా ఉన్నాయని, కానీ అంతర్గత చిన్న రోడ్ల గురించి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని, స్థానికులు వాహనదారులు కోరుతున్నారు. రోడ్ల పనులు ప్రారంభించక పోతే త్వరలో ఎన్నికల కోడ్ వస్తుందని, ఈ కారణంగా రోడ్డు నిర్మాణ పనులు మరింత జాప్యం అవుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

వెంటనే పనులు చేపట్టాలి

కాలనీలోని అంతర్గత రోడ్లు గుంతలుగా మారాయి. వీటికి తక్షణమే రహదారి నిర్మాణ పనులు చేపట్టాలి. ఎన్నికల కోడ్ వస్తే పనులు మరింత జాప్యం కావచ్చు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించాలి.

\- టీ విజయ సింగ్,
కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

పంజాగుట్ట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అత్యంత వెనుకబడిన వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలని బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మీనగ గోపీ బోయ డిమాండ్ చేశారు. సమితి ఆధ్వర్యంలో శుక్రవారం హలో వాల్మీకి.. చలో హైదరాబాద్ పేరుతో మేధావులు, డీఎన్‌టీ, ఎంబీసీ, బీసీ కుల సంఘాల ప్రతినిధులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని, ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ఇచ్చిన హామీపై శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మేధోమథన సదస్సు ఏర్పాటు చేశారు. తమ సామాజికవర్గం ఇతర రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ జాబితాలో ఉండగా తెలంగాణలో బీసీ జాబితాలో ఉందని, వెంటనే తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని గోపి బోయ అన్నారు. తమకు ఒక ఎమ్మెల్సీ, ఎంపీ పదవి ఇవ్వాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కుల వృత్తి లేని తమను ఆదుకోవాలని, బోయ బంధు పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. గద్వాల్‌లో ప్రత్యేక గురుకులాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, బీసీ సేన అధ్యక్షుడు బి.కృష్ణ యాదవ్, సమితి ఉపాధ్యక్షులు రాజేశం, అంజయ్య, ప్రధాన కార్యదర్శి చందర్‌రావు, యాదయ్య, నరేష్, వివిధ జిల్లాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ఎర్రగడ్డ ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి మహమూద్ అలీ, సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావు, మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి టీ పద్మారావు అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డలోని షంషీర్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి షరీఫ్ ఖురేషి, షేక్ జావిద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి పండగకు ప్రజలకు బహుమతులు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ... రంజాన్ పవిత్ర మాసంలో ముస్లింలు పవిత్రంగా నిష్ఠతో నిర్వహించే ఉపవాస దీక్షలు ప్రత్యేకంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు జానీ మియా, కార్పొరేటర్లు దేదీప్య రావు, రాజకుమార్ పటేల్, ఎర్రగడ్డ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డి.సంజీవ, నాయకులు జి.రాము, సంతోష్ గౌడ్, శవానీ అహ్మద్, మహమ్మద్ అజార్, మొహమ్మద్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

చెంగిచెర్ల బాధితులకు న్యాయం చేయాలి



ఖైరతాబాద్ ప్రధాన రహదారిలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గిరిజన ప్రతినిధులు

ఖైరతాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): చెంగిచెర్లలో అమాయక పార్థీవాడ కుటుంబాల మహిళలపై జరిగిన దాడి అమానవీయమని, బాధితులకు వెంటనే న్యాయం జరిగేలా పోలీసులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. శుక్రవా రం ఖైరతాబాద్ చౌరస్తా సమీపంలో బీజేపీ నేత శక్తి లాల్ హీరా ఆధ్వర్యంలో పార్థీవాడలకు చెందిన ప్రతినిధులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరస న వ్యక్తంచేశారు. పోలీసుల ఉదాసీనతవల్ల ప్రభుత్వంపై భరోసా తగ్గే అవకాశం ఉంటుందని లాల్‌హీరా హెచ్చరించారు. మహేందర్, అనిల్‌రిరతిక్, సూర్య, మాణిక్యం ఉన్నారు.

జేఎన్‌టీయూలో నత్తనడకన పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ

- దరఖాస్తు గడువు ముగిసి నెల గడిచినా కొలిక్కిరాని పరిశీలన

హైదరాబాద్ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) అడ్మిషన్ల ప్రక్రియ నత్తనడకన కొనసాగుతోంది. ఈ ఏడాది జనవరి 23న అడ్మిషన్ల కోసమని నోటిఫికేషన్ జారీకాగా, ఫిబ్రవరి 24తో దరఖాస్తు గడువు ముగిసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ దఫా నోటిఫికేషన్‌కు అనూహ్య స్పందన లభించింది. మొత్తం 16 సబ్జెక్టుల్లో అడ్మిషన్లకు గాను 1,031మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఒక్క కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టుకే అత్యధికంగా 486 దరఖాస్తులు వచ్చాయి. అయితే, దరఖాస్తు గడువు ముగిసి నెలరోజులు దాటినా ప్రవేశపరీక్ష గురించి గానీ, ఇంటర్వ్యూ షెడ్యూల్ గురించి గానీ యూనివర్సిటీ వైపు నుంచి ఎటువంటి ప్రకటన కూడా రాలేదు. దీంతో అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జేఎన్‌టీయూ అధికారులు ప్రవేశపరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారో తెలియకపోవడంతో, జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)అర్హత పొందిన అభ్యర్థులు ఇతర యూనివర్సిటీల వైపు చూస్తున్నారు. మరోవైపు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలలో పనిచేస్తూ, పార్ట్‌టైమ్ పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు.. యూనివర్సిటీ అడ్మిషన్ల షెడ్యూల్ ముందుగా ప్రకటిస్తే.. తాము పనిచేసే సంస్థలలో సెలవు కోసం ప్లాన్ చేసుకునేందుకు వీలవుతుందంటున్నారు. ఒకవేళ అకస్మాత్తుగా లేదా ఆలస్యంగా ఎంట్రన్స్, ఇంటర్వ్యూలు నిర్వహించిన పక్షంలో.. గతేడాది మాదిరిగా సగానికి సగంమంది గైర్హాజరయ్యే అవకాశం ఉందంటున్నారు. ఈ విషయమై అడ్మిషన్స్ డైరెక్టర్ వెంకటరామిరెడ్డిని వివరణ కోరగా, సబ్జెక్టుల వారీగా దరఖాస్తుల విభజన పూర్తి చేశామని, ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే అడ్మిషన్స్ కమిటీ పరిశీలనకు పంపుతామన్నారు.



టీడీపీ జెండాను ఎగురవేసిన పార్టీ నాయకులు నర్సింహులు తదితరులు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

బంజారాహిల్స్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్‌లో శుక్రవారం టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ నాయకులు పార్టీ జెండాను ఎగరవేసి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు నర్సింహులు మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే అది టీడీపీతోనే సాధ్యం అవుతుందన్నారు. ఏపీలో టీడీపీ కూటమి విజయం సాధిస్తుందన్నారు. పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు తెలంగాణపై దృష్టి సారించారని, కార్యకర్తలను, నాయకులను సంఘటితం చేసి టీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవిందు, ఎండీ సలీం, శ్రీనివాసులు, మల్లేష్, ఎం.సాయికుమార్, నాగరాజు పాల్గొన్నారు.



వేసవి క్రికెట్ శిబిరంలో క్రీడాకారులు

వేసవి క్రికెట్ శిక్షణ తరగతులు

సనత్‌నగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ జీహెచ్‌ఎంసీ వెల్ఫేర్ గ్రౌండ్‌లో వేసవిలో క్రికెట్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్న యువకులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని క్రికెట్ కోచ్ రాజ్‌కిరణ్ తెలిపారు. నెలకు రూ. 200 మాత్రమే తీసుకొని శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఉదయం 6 నుంచి 7గంటల వరకు నెట్ ప్రాక్టీస్ సెషన్‌లు నిర్వహిస్తున్నారు. బౌలింగ్, ఫీల్డింగ్, కీపింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాలు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 60మంది క్రీడా కారులు శిక్షణకు హాజరు అవుతున్నారని, ఈఅవకాశాన్ని ఆసక్తి ఉన్న క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

‘ తెలంగాణలో మాల, మాదిగల జనాభా సమానం’

పంజాగుట్ట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మాల, మాదిగల జనాభా సమానంగా ఉంటుందని, తమకు సీట్లు ఇస్తే వారు ఓర్వడంలేదని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. తమ సామాజిక వర్గంపై మాదిగలు చేస్తున్న అబద్ధపు, గ్లోబల్, తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనాదిగా తమ సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీకి అండగా ఉందని, రాజకీయ లబ్ధికోసం కొంతమంది రోజుకో పార్టీ మారుతూ.. తమ స్వార్థం, లబ్ధికోసం ప్రజలకు తప్పుడు సంకేతాలను పంపిస్తున్నారన్నారు. వీరి మాటలను ఎవరూ నమ్మకూడదని, వారి వైఖరిని మార్చుకోవాలన్నారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ పార్టీలో ఉండి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి పెద్దపల్లి, వరంగల్ పార్లమెంట్ స్థానాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ టికెట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రిన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ప్రకాష్ నగర్, భరత్ నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 6 గంటల నుంచి ఉదయం 6.30 గంటల వరకు, గ్రీన్ పార్క్, ఫతేనగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 6.30 నుంచి ఉదయం 7 గంటల వరకు, బేగంపేట, అల్లావుద్దీన్ కోఠి ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి ఉదయం 7.30గంటల వరకు, ఎస్వీఎస్ టెంపుల్, అవంతి నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి ఉదయం 8 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

‘రోడ్డు మధ్యలోని ఆలయాన్ని మార్చాలి’

బేగంపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడీ లేన్‌నెంబరు-6లో రోడ్డు మధ్యలో ఉన్న పోచమ్మ దేవాలయానికి రోడ్డు నెంబరు-5లోని ప్రభుత్వ స్థలం కేటాయింపు జరపాలని ఆలయ అధ్యక్షుడు, బ్రాహ్మణవాడీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆలయం రోడ్డు మధ్యలో ఉండడంవల్ల భక్తులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. బ్రాహ్మణవాడీ లేన్ నెంబరు-5లోని సర్వే నెంబర్ 203, 204, 205లలో ఉన్న ప్రభుత్వ భూమి ఖాళీగా ఉందని, ఆలయ నిర్మాణానికి ఈస్థలం అనువుగా ఉంటుందన్నారు. ఆలయాన్ని ఇక్కడకు మార్చేందుకు సదరు స్థలం కేటాయించాలని, దీనివల్ల భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఇప్పటికే ఈవిషయంపై ప్రభుత్వంలోని పెద్దలకు, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయగా వారు సానుకూలంగా స్పందించారన్నారు.



ఆధ్యాత్మిక బోధనలు చేస్తున్న పాస్టర్ బ్రదర్ అబ్రహం

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ఖైరతాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): శుభ శుక్రవారం సందర్భంగా చర్చిల్లో ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఖైరతాబాద్ లెమన్స్ ఎవాంజెలికల్ ఫెలోషిప్ (ఎల్ఈఎఫ్) చర్చిలో క్రీస్తు శిలువ ధారణను గుర్తు చేస్తూ ప్రార్థనాగీతాలు ఆలపించారు. దైవ సేవకులు బ్రదర్ అబ్రహం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రజలు చేసిన పాపాల విమోచన కోసం శిలువధారణ చేసుకున్నారని అన్నారు. క్రీస్తు బోధించిన సూక్తులు ఆచరణ యోగ్యమని గుర్తు చేశారు.

● మారుతీనగర్‌లోని దమస్కస్ చర్చిలో దైవ ప్రార్థనలు జరిగాయి. చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎ.ఆర్ పాల్ కరుణాకర్‌తో పాటు పలువురు పాస్టర్లు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రపంచ మానవాళికి క్రీస్తు శాంతి దూతగా నిలిచారని పేర్కొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు మహేందర్

‘నామినేటెడ్ పదవుల్లో బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలి’

బంజారాహిల్స్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు ఆరే మహేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీకుల జనగణన తీర్మానం చేసి జీవో26 విడుదల చేయడం కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ కాంగ్రెస్ టికెట్ కేటాయించిందని గుర్తు చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న చినజీయర్ స్వామి

నృత్య మహోత్సవం ప్రారంభం

మియాపూర్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని సీసీఆర్టీ క్యాంపస్‌లో సంగీత, నృత్య మహోత్సవాన్ని శుక్రవారం చినజీయర్ స్వామి ప్రారంభించారు. ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు జరగనున్నాయి. ప్రముఖ శాస్త్రీయ నృత్య కారిణి, పండితురాలు వక్త, రచయిత, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆనందశంకర్ జయంత్, భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, శంకరానంద కళా క్షేత్ర నాట్యారంభ, సహకారంతో ఏర్పాటు చేశారు.

‘భవిష్యత్తు దర్శనం చేసే రచనలు చేయాలి’

చిక్కడపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సాహితీవేత్తలు వర్తమాన సంఘటనలపై స్పందించడమే కాక భవిష్యత్తు దర్శనం చేసే రచనలు చేయాలని వేంకటేశ్వరయూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఆచార్య కొలకలూరి మధుజ్యోతి రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యసృష్టి దృష్టి గ్రంథావిష్కరణసభ శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇనాక్ గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మధుజ్యోతి ఏడు ప్రక్రియలపై లోతైన అధ్యయనం చేసి పరిశోధనకు సరిపడా విశ్లేషణ తన గ్రంథంలో చేశారని అభినందించారు. గ్రంథరచయిత మధుజ్యోతి మాట్లాడుతూ.. ఇనాక్ సాహిత్యం సమస్తం ప్రేమతత్వంతో ముడివడి ఉంటుందన్నారు. స్త్రీ హక్కులు స్వేచ్ఛ గురించి ఎవరూ మాట్లాడని రోజుల్లో ఐదు దశాబ్దాల కిందటే ఇనాక్ తనసాహిత్యంలో వాటి గురించి ప్రస్తావించారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి, చక్రపాణి, గుండవరపు గీతాదేవి, ప్రొఫెసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఆరేళ్ల బాలిక మృతి

గోషామహల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఆరేళ్ల బాలిక ఉరేసుకుని చనిపోయిన సంఘటన శుక్రవారం షాహినాథ్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... గోషామహల్ జోషివాడకు చెందిన డిల్లు, ఆస్మిత దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వృత్తిరీత్యా డిల్లు పాత సామగ్రిని కొనుగోలు చేసి విక్రయిస్తాడు. భార్యాభర్తలిద్దరూ పని కోసం బయటికి వెళ్లే ముందు ముగ్గురు పిల్లలను ఇంట్లోనే ఉంచి వెళ్లారు. గురువారం కూతురు పవిత్ర(6) ఇంట్లో ఆడుకుంటుండగా మధ్యాహ్నం సమయంలో తల్లి ఇంటికి వచ్చి అన్నం పెట్టి తిరిగి పనికి వెళ్లింది. పని ముగించుకొని రాత్రి 8.30 గంటలకు తల్లి ఇంటికి చేరుకొని తలుపులు తెరిచి చూసేసరికి పవిత్ర చున్నీ బిగించుకొని అపస్మారకస్థితిలో ఉంది. వెంటనే ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయిందని నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొండాపూర్ ఫ్లైఓవర్‌పై 2వే ట్రయల్ రన్



ట్రయల్ రన్ ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న సీపీ అవినాష్ మహంతి, పోలీస్ అధికారులు

రాయదుర్గం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడ, కొండాపూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు కొండాపూర్ ఫ్లైఓవర్‌పై రెండు వైపులా వాహనాలను అనుమతించేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించారు. కొండాపూర్ ఫ్లైఓవర్‌పై గచ్చిబౌలి వైపు నుంచి హఫీజ్‌పేట్‌వైపు, మాదాపూర్ హైటెక్‌సిటీ వైపు వెళ్లేందుకు వన్‌వేకు మాత్రమే అవకాశ ఉండేది. కొత్తగూడ, కొండాపూర్ ఫ్లైఓవర్ పైకి వెళ్లేందుకు గచ్చిబౌలి వైపు నుంచి వచ్చే వాహనాలు, నెక్సా షోరూమ్ వద్ద ఫ్లైఓవర్ ఎక్కేందుకు అవకాశం ఉంది. అదేవిధంగా మసీదుబండ, శ్రీరామ్‌నగర్ కాలనీ నుంచి వచ్చే వాహనాలను బొటానికల్ గార్డెన్ వద్ద ఫ్లైఓవర్ ఎక్కేవి. వీరికి మాదాపూర్ హఫీజ్‌పేట్ వైపు వెళ్లేందుకు వీలుగా ఉండేది. అయితే ఐటీ ఉద్యోగులు ఉదయం సమయంలో మియాపూర్ నుంచి హఫీజ్‌పేట్ మీదుగా ఫ్లైఓవర్ కిందినుంచి గచ్చిబౌలి వైపు వెళ్లే వారు. దీంతో హఫీజ్‌పేట్ కొండాపూర్ ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఉదయం సుమారు 9నుంచి 11 గంటల వరకు ట్రాఫిక్‌జామ్ కిలోమీటర్ల అయ్యి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను తగ్గించేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొండాపూర్ ఫ్లైఓవర్‌పైకి హఫీజ్‌పేట్ నుంచి వచ్చే వాహనాలను కూడా అనుమతించేందుకు శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ ట్రయల్‌రన్‌ను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ రావు, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ శివకుమార్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, గచ్చిబౌలి ట్రాఫిక్ సీఐ రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు.

శబ్దకాలుష్యం చేస్తే కఠిన చర్యలు

● ఇన్‌స్పెక్టర్ అనుదీప్



బౌద్ధనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా శబ్దకాలుష్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ హెచ్చరించారు. పెళ్ళిళ్లు, ఇతర శుభకార్యాలను పురస్కరించుకుని చాలామంది నిబంధనలను పక్కన పెట్టి అర్ధరాత్రి వరకు విపరీతమైన శబ్దకాలుష్యానికి పాల్పడుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈనేపథ్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీజేలకు ఎటువంటి అనుమతి లేదని, డప్పుచప్పుళ్లు, బ్యాండ్‌లతో పోటీ పరీక్షలు, వివిధ పరీక్షలు రాసేవిద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నట్లు తమదృష్టికి వచ్చిందన్నారు. నిబంధనలను అతిక్రమించి ప్రజాజీవనానికి భంగం కలిగిస్తే సీపీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని, బ్యాండ్లను సీజ్ చేస్తామని తెలిపారు. అర్ధరాత్రుళ్లు శబ్దకాలుష్యం చేస్తే చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌కు కాని, డయల్ 100కు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

రోడ్డు మధ్యలోని ఆలయాన్ని మార్చాలని వినతి

బేగంపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడీ లేన్ నెంబరు-6లో రోడ్డు మధ్యలో ఉన్న పోచమ్మ దేవాలయానికి రోడ్డు నెంబరు-5లోని ప్రభుత్వ స్థలం కేటాయింపు జరపాలని ఆలయ అధ్యక్షుడు, బ్రాహ్మణవాడి వేల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ శ్రీనివాస్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆలయం రోడ్డు మధ్యలో ఉండడం వల్ల భక్తులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. బ్రాహ్మణవాడీ లేన్ నెంబరు-5లోని సర్వే నెంబరు 203, 204, 205లలో ఉన్న ప్రభుత్వ భూమి ఖాళీగా ఉందని, ఆలయ నిర్మాణానికి ఈ స్థలం అనువుగా ఉంటుందన్నారు. ఆలయాన్ని ఇక్కడకు మార్చేందుకు సదరు స్థలం కేటాయించాలని, దీని వల్ల భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఇప్పటికే ఈ విషయంపై ప్రభుత్వంలోని పెద్దలకు, స్థానిక ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేయగా వారు సానుకూలంగా స్పందించారన్నారు.

డిన్నర్ చేద్దామని గదికి తీసుకెళ్లి యువతిపై అత్యాచారం

బంజారాహిల్స్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): డిన్నర్ చేద్దామని యువతిని ఓయో గదికి తీసుకెళ్లి అత్యాచారం చేసిన జొమాటో డెలివరీ బాయ్‌ని పోలీసులు అరెస్టు చేశారు. నగరానికి చెందిన ఓ యువతి (23) ఎనిమిది నెలల క్రితం ఓ సైన్స్ కాన్ఫరెన్స్‌కు హాజరైంది. ఆకలి కావడంతో జొమాటోలో ఆహారం ఆర్డర్ చేసింది. జొమాటోలో డెలివరీ బాయ్‌గా పనిచేసే ఓబెదుల్లా ఖాన్ ఆమెకు ఆహారం ఇచ్చాడు. డబ్బును గూగుల్ పే ద్వారా చెల్లించింది. ఈ సమయంలో ఇద్దరి మధ్య ఫోన్ నెంబర్ల మార్పిడి జరిగింది. తరుచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. కలిసేవారు. ఇదిలా ఉండగా ఈనెల 27న యువతిని ఓబెదుల్లా ఖాన్ కలిశాడు. ఇద్దరు కలిసి పలుచోట్ల తిరిగారు. డిన్నర్ చేసుకుంటూ మాట్లాడుకుందామని యువతిని బంజారాహిల్స్‌లోని ఓయో రూంకు తీసుకెళ్లాడు. కొద్దిసేపు మాట్లాడుకున్న తర్వాత యువతిపై అత్యాచారం చేశాడు. ఈవిషయం బయటకు చెప్పవద్దని చెప్పాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఓబెదుల్లా ఖాన్‌పై సెక్షన్ 376, 354(ఎ), 354(డి)ఐపీసీతో పాటు ఐటీ యాక్ట్ 66(ఈ) కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వజ్రాభరణాలు చోరీ

బంజారాహిల్స్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వ్యాపారి ఇంట్లో వజ్రాభరణాలు చోరీ అయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లో నివసించే యష్‌లల్వాని వ్యాపారి. ఫిబ్రవరి 2న ఆయన తల్లి బీరువాలో వజ్రాలతో కూడి బంగారు పెద్ద నక్లెస్‌తో పాటు వజ్రాల చెవికమ్మలు పెట్టింది. అనంతరం వివాహ వేడుకకు వెళ్లేందుకు అదే నెల 12న బీరువా తెరిచి చూడగా అభరణాలు కనిపించలేదు. సీసీ కెమెరాలు పరిశీలించగా ఇంట్లో పనిచేసే బిహార్‌కు చెందిన సాహెబ్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని ప్రశ్నించగా సరైన జవాబులు ఇవ్వలేదు. దీంతో యష్‌లల్వాని బంజారాహిల్స్ పోలీసులకు ఈనెల 28న ఫిర్యాదు చేయగా, వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీనివాసరావుకు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్శిటీ ప్రతినిధులు

సామాజిక కార్యకర్త బాసాని శ్రీనివాసరావుకు డాక్టరేట్

బౌద్ధనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండికి చెందిన సామాజిక కార్యకర్త బాసాని శ్రీనివాసరావుకు ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ నగరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాసాని శ్రీనివాసరావుకు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకుగాను తనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్శిటీ, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ నిర్వాహకులకు బాసాని శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.



యాదగిరిని సత్కరిస్తున్న ఎన్.శ్రీగణేష్ తదితరులు

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కంటోన్మెంట్ అధ్యక్షుడిగా యాదగిరి

సికింద్రాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కంటోన్మెంట్ విభాగం అధ్యక్షునిగా రసూల్‌పురాకు చెందిన యాదగిరి శుక్రవారం నియమితులయ్యారు. రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ జగన్‌లాల్ ఈ మేరకు నియామక పత్రాన్ని అందచేశారు. అనంతరం యాదగిరిని కంటోన్మెంట్ కాంగ్రెస్ నాయకుడు ఎన్.శ్రీగణేష్, ప్రభాకర్, శ్రీనివాస్, అంకుష్, మల్లేష్ సత్కరించారు.

లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు

- తనిఖీలు మరిచిన పోలీసులు
- అధిక ధరలకు గదులు
- నిబంధనలు పాటించని నిర్వాహకులు

సికింద్రాబాద్ చుట్టుపక్కల ఉన్న లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. తనిఖీలు చేయాల్సిన పోలీసులు పట్టించుకోవడంలేదు. దీనిని లాడ్జీల నిర్వాహకులు ఆసరాగా చేసుకుని గుర్తింపుకార్డు లేకుండానే అధిక ధరలకు గదులను గద్దెకు ఇస్తున్నారు.



సికింద్రాబాద్‌లో ఉన్న ఓ లాడ్జి

అడ్డగుట్ట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 48 లాడ్జీలు, 25 డార్మెటరీ లాడ్జీలతోపాటు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, రేతిఫైల్ బస్టాండ్ ఎదురుగా ఉన్న రెజిమెంటల్ బజార్, పరికిబస్తీ ఇతర ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న లాడ్జీల యజమానులు నిబంధనలు పాటించడం లేదు. గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తింపు కార్డు లేకున్నా గదులు అద్దెకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండడంతో కుటుంబంతో వచ్చిన వారు గదులు ఖాళీ చేసి మరోచోటుకు వెళ్తున్నారు. రేతిఫైల్ బస్టాండ్ వద్ద ఉన్న ఓ లాడ్జీలో కేవలం వ్యభిచారం నిర్వహించేందుకు గదులు అధిక ధరకు అద్దెకు ఇస్తున్నట్లు కొందరు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ప్రతీరోజూ లాడ్జీల్లో తనిఖీలు చేపట్టి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

డార్మెటరీలకు భలే గిరాకీ

సికింద్రాబాద్‌లో ఉన్న లాడ్జీలు ఓయో గదులకు మార్చడంతో కొందరు డార్మెటరీలకు పరిమితమవుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఉంటే రెండు వందలు అద్దె కావడంతో గిరాకీ పెరిగింది.

గుర్తింపు లేకుండానే గంజాయి విక్రేతలకు

ఇటీవల గోకుల్ లాడ్జీకి ఇద్దరు వ్యక్తులు బుధవారం రాత్రి వచ్చారు. వీరి గుర్తింపు కార్డులను లాడ్జీ నిర్వాహకులు తీసుకోలేదు. పోలీసులు తనిఖీ చేసేందుకు రాగా వారు 50 కిలోల గంజాయిని వదిలి పరారైన విషయం తెలిసిందే. ఈ ఘటనను అసాంఘిక కార్యకలాపాలకు నిదర్శనంగా చెప్పొచ్చు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



నామాలగుండులో జరిగిన వేడుకల్లో టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్ తదితరులు

బౌద్ధనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం సీతాఫల్‌మండి నామాలగుండులో ఘనంగా నిర్వహించారు.

సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు జీవీ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాసకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి, టీడీపీ జెండాను ఎగురవేసి కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌రావు, విజయకుమార్, చిరంజీవి రాజు, విజయకుమార్, అలెక్స్, బాలకృష్ణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట : తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి టీడీపీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనతరం టీడీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కాసుల సుదర్శన్‌రెడ్డి, చందర్ ముదిరాజ్, నర్సింహ, నటరాజ్, బాలాజీ, చిరంజీవి, రాజు, శశిరేఖలతో పాటు ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.



అడ్డగుట్ట డివిజన్‌లో ..

చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు



లాల్‌బజార్ వెస్లీ గ్యారిసన్ చర్చిలో ఫాదర్ జోసఫ్.

తిరుమలగిరి మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బొల్లారం, లాల్‌బజార్‌లలోని చర్చిలలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు చర్చిలకు చేరుకొని మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దయామయుడైన యేసు క్రీస్తు త్యాగమే గుడ్ ఫ్రైడే అని గ్యారిసన్ వెస్లీ చర్చిలో ఫాదర్ జోసెఫ్ అన్నారు. తన జీవితాన్ని ప్రపంచానికి గొప్ప సందేశంగా జీజస్ అందించారని అన్నారు. ప్రభువు చూపిన ప్రేమ, కరుణ, క్షమ, త్యాగ మార్గాన్ని అనుసరించడం ద్వారా గుడ్‌ఫ్రైడే వేడుకగా జరుపుకుంటారు అన్నారు. బొల్లారం హోలీ ట్రినిటీ చర్చిలో పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



గుడ్ ఫ్రైడే వేడుకల్లో ఆర్చి బిషప్ పూల ఆంథోని



ప్రార్థనలకు హాజరైన భక్తులు

హోలీ ఫ్యామిలీ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు

గుడ్‌ఫ్రైడే వేడుకలు తిరుమలగిరి లాల్‌బజార్ లోని హోలీ ఫ్యామిలీ చర్చిలో శుక్రవారం జరిగాయి. కార్డినల్ హైదరాబాద్ ఆర్చి బిషప్ పూల అంథోని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సకల జనుల కోసం యేసుక్రీస్తు త్యాగమే గుడ్‌ఫ్రైడే అన్నారు. యేసు ప్రభు శిలువ మరణంపై వాక్యోపదేశం చేశారు. శిలువ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశ్వాసులు భారీ సంఖ్యలో వచ్చారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు మైఖేల్ అబ్రహం ఆధ్వర్యంలో యేసు క్రీస్తు భక్తి గీతాలు ఆలపించారు.

షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి పేరుతో రూ.5లక్షలకు టోకరా

హైదరాబాద్ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ ఉపయోగించి షేర్ మార్కెట్‌లో లాభాలు సంపాదించవచ్చని ప్రచారం చేసుకున్న సైబర్ నేరగాళ్లు నగరవాసి నుంచి రూ.5.02లక్షలు కాజేశారు. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన వృద్ధుడు (72) ఖాళీ సమయంలో షేర్ మార్కెట్ ట్రేడింగ్ చేయాలని భావించాడు. దాని కోసం ఆన్‌లైన్‌లో కృత్రిమ మేధ వినియోగించి షేర్ మార్కెట్‌లో డబ్బు సంపాదించవచ్చనే వీడియోలు చూశాడు. తాను కూడా ప్రయత్నిస్తే తప్పేముందని ఫోన్ నెంబర్, ఇతర వివరాలను ఇచ్చి రిజిస్టర్ అయ్యాడు. వారు ముందుగా టెలిగ్రామ్ గ్రూపులో యాడ్ చేశారు. ట్రేడింగ్ చేసేందుకు వారు పంపిన లింక్ ద్వారా సూచించిన 'క్యాపిటలిక్స్'ను యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ట్రేడింగ్ చేయాలంటే కనీసం 200 డాలర్ల (రూ.17వేలు) పెట్టుబడి ఉండాలని చెప్పడంతో యాప్ నిర్వాహకులకు డబ్బులు చెల్లించాడు. వారు సూచించిన విధంగా షేర్‌లు కొనుగోలు చేశాడు. ముందుగా కొద్ది మొత్తాన్ని లాభం పేరుతో ఖాతాలో జమ చేసిన సైబర్ నేరగాళ్లు, మరింత లాభం కావాలంటే 1500 డాలర్ల నుంచి 2000 డాలర్లు పెట్టుబడి పెట్టాలని సూచించారు.

ఇలా పెట్టుబడి పెడితే కాంప్లిమెంటరీ పాయింట్లు ఇస్తామని, వాటితో మెటల్, ఫోరెక్స్ ట్రేడింగ్ చేసుకోవచ్చని ఆశపెట్టారు. ఇలా పలు మార్లు రూ.5.02లక్షల వరకు పెట్టుబడి పెట్టి వారు సూచించిన షేర్లు కొనుగోలు చేశాడు. షేర్ ట్రేడింగ్‌లో 4000 డాలర్ల లాభం రావాలంటే తాను సూచించిన షేర్లు కొనుగోలు చేయాలని సూచించారు. పెట్టుబడి పెట్టినా ఇప్పటి వరకు లాభాలు రాకపోవడంతో పాటు, పెట్టిన పెట్టుబడి తిరిగి రావాలంటే మళ్లీ పెట్టుబడులు పెట్టాలని సూచించారు. దాంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్‌ల ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని చెబితే నమ్మి పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు





బీకేగూడ, రవీందర్‌నగర్ అంతర్గత రోడ్ల పరిస్థితి

- మరమ్మతులు చేయాలని వినతి
- ఇబ్బందుల్లో బీకేగూడ, రవీందర్‌నగర్ కాలనీ వాసులు

సనత్‌నగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్ బీకేగూడ రవీందర్‌నగర్ కాలనీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. డ్రైనేజ్, వాటర్ వర్క్స్, అధికారులు తమ పనులు, మరమ్మతులు చేయడానికి ఎక్కడ పడితే అక్కడ రోడ్లను తవ్వడం వల్ల రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్లు వేసి ఎన్నో సంవత్సరాలు కావడంతో వర్షానికి రోడ్డుకు ఇరువైపులా కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారాయి. రోడ్లు తవ్వి పనులు పూర్తయిన తర్వాత దాన్ని పట్టించుకోకపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఈరోడ్లపై నీరు నిలవడం, గుంతలు పడడంతో ఈ మార్గాల గుండా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని ప్రధాన రహదారులు చక్కగా ఉన్నాయని, కానీ అంతర్గత చిన్న రోడ్ల గురించి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని, స్థానికులు వాహనదారులు కోరుతున్నారు. రోడ్ల పనులు ప్రారంభించకపోతే త్వరలో ఎన్నికల కోడ్ వస్తుందని, ఈ కారణంగా రోడ్డు నిర్మాణ పనులు మరింత జాప్యం అవుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

వెంటనే పనులు చేపట్టాలి

కాలనీలోని అంతర్గత రోడ్లు గుంతలుగా మారాయి. వీటికి తక్షణమే రహదారి నిర్మాణ పనులు చేపట్టాలి. ఎన్నికల కోడ్ వస్తే పనులు మరింత జాప్యం కావచ్చు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించాలి.

- టీ విజయ సింగ్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు



మహేంద్రహిల్స్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను టచ్‌లోకి తీసుకోవడం పెద్ద విషయం కాదు

● మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలకు ఈటల కౌంటర్

మారేడ్‌పల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తో 8మంది బీజేపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారన్న కోమటిరెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ మాజీ మంత్రి ఈటల రాజేందర్ కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం మహేంద్రహిల్స్‌లో బీజేపీ సీనియర్ నాయకులు మల్కా కొమరయ్య క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూత్ బీజేపీ నాయకులు యశస్వినితో కలిసి మాజీ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడారు.

కాంగ్రెస్‌కు 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉంటే బీజేపీకి 60మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను టచ్‌లోకి తీసుకోవడం పెద్ద విషయం కాదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే వాళ్ళ మాటలు కోటలు దాటుతున్నాయని ఆరోపించారు. మల్కాజ్‌గిరి టికెట్ ఆశించిన వారందరితో కలిసి పనిచేసి తాను విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మాదిరిగానే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డబ్బుతో నాయకులను, కార్యకర్తలను కొనుగోలు చేస్తుందని విమర్శించారు. అన్ని రంగాలు, వర్గాల ప్రజలు నరేంద్ర మోడీ మరోసారి ప్రధాని కావాలనుకుంటున్నారని అన్నారు.



చేనేత హస్తకళా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వస్త్రాలను ఆసక్తిగా పరిశీలిస్తున్న వినియోగదారులు

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన

● వచ్చే నెల 7 వరకు పొడిగింపు

తార్నాక, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు ఫ్యాషన్ వస్త్రాలను ఒకే వేదికపై అందించేందుకు కళా సిల్క్ సొసైటీ ఆధ్వర్యంలో తార్నాకలోని ఐఐసిటీ స్టాఫ్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఎగ్జిబిషన్‌లో ప్రధానంగా చీరాల కుప్పడం, మంగళగిరి, టిష్యూ పట్టుచీరలు, బ్లాక్ ప్రింట్ సిల్క్ చీరలు, పోచంపల్లి, ఇక్కత్ డిజైన్ కుర్తీస్, బెంగాలీ కాటన్, ఉప్పాడ వెంకటగిరి, ధర్మవరం సిల్క్ శారీస్‌తో పాటు, హ్యాండీక్రాఫ్ట్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీస్ వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని ఎగ్జిబిషన్ నిర్వహకులు వికాస్ జైన్ శుక్రవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి చేనేత హస్తకళాకారులంతా ఒకే చోట చేరి 50 స్టాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చేనేత హస్తకళా ప్రదర్శనకు నగర ప్రజల వద్ద నుంచి వస్తున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని వచ్చే నెల 7 వరకు పొడిగించడం జరిగిందని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగపరుచుకుని చేనేత హస్తకళలను మరింత ప్రోత్సహించాలని కోరారు.

మహావీర్ జయంతి వేడుకలకు రండి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న యోగేష్‌జైన్, శ్రీగణేష్

సికింద్రాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 21వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరిగే మహావీర్ జయంతి వేడుకలకు రావాలని తెలంగాణ జైన్స్ రాష్ట్ర అధ్యక్షుడు యోగేష్ జైన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్.శ్రీగణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎంను కలిసి ఈమేరకు ఆహ్వాన పత్రిక అందచేశారు. తెలంగాణ జైన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్‌జైన్, కోశాధికారి మహేందర్‌జైన్, ప్రధాన కార్యదర్శి అశోక్‌జైన్, కంటోన్మెంట్ జైన సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ బార్ అసోసియేషన్

అధ్యక్షుడిగా వసంత్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ



వసంత్‌కుమార్

అడ్డగుట్ట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సివిల్ కోర్టులో గురువారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం మొదలైన పోలింగ్ రాత్రి వరకు సాగింది. సికింద్రాబాద్ కోర్టు న్యాయవాదులు తమదైన శైలిలో పోటాపోటీగా ప్రచారాలు చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా వసంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సుశీల్, ఉపాధ్యక్షుడిగా టి.వెంకటరమణ, సంయుక్త కార్యదర్శిగా బుచ్చిబాబు, లేడీ రిప్రజెంటిటేటీవ్‌గా పుష్పలత, మహిళా కార్యవర్గ సభ్యురాలిగా హిమవర్ష, క్రీడా సభ్యుడిగా నవీన్‌రెడ్డి, లైబ్రరీ కార్యదర్శిగా గంగాధర్, కోశాధికారి ప్రవీణ్, కార్యవర్గ మహిళా సభ్యురాలు సౌమ్య, కార్యవర్గ సభ్యుడు సంతోష్ భారీ మోజారిటీతో గెలుపొందారు. ఎన్నికల అధికారిగా రామయ్య నాయుడు వ్యవహరించారు. అనంతరం గెలుపొందిన న్యాయవాదులు కోర్టు ఆవరణలో సంబురాలు జరుపుకున్నారు.

అధిష్టానం అవకాశం ఇస్తే ఉప ఎన్నికల్లో పోటీచేస్తా

● టీఎన్.సదాలక్ష్మి తనయుడు డాక్టర్ వంశతిలక్



బోయిన్‌పల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నికలో బీజేపీ అధిష్టానం అవకాశం ఇస్తే ఉప ఎన్నికల్లో పోటీ చేస్తానని డాక్టర్ టి.ఎస్.వంశతిలక్ మాదిగ తెలిపారు. ఈమేరకు కంటోన్మెంట్ నియోజకవర్గంలోని డైమండ్ పాయింట్‌లో గల గాయత్రి గార్డెన్స్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనది రాజకీయ కుటుంబ నేపథ్యమని, తన తల్లి టీఎన్ సదాలక్ష్మి కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని బొల్లారం ప్రాంతానికి చెందిన స్థానికులమని అన్నారు. సదాలక్ష్మి 1957లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎస్‌సి రిజర్వుడు స్థానం కామారెడ్డి నుంచి శాసనసభకు ఎన్నికయ్యారని చెప్పారు. 1960లో డిప్యూటీ స్పీకర్‌గా, 1962లో ఉమ్మడి రాష్ట్రంలో తొలి మహిళా మంత్రిగా పనిచేశారని చెప్పారు. 1969లో తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. 1982లో టీడీపీలో చేరారని చెప్పారు. తన తండ్రి పద్మశ్రీ టీవీ నారాయణ, ఏపీపీఎస్సీ సభ్యుడుగా, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొనసాగారని, ప్రస్తుతం ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా బీజేపీ పార్టీకి సేవలందిస్తూ తాను బీజేపీలో కొనసాగుతున్నట్లు చెప్పారు ఆర్ఎస్ఎస్ భావజాలంతో దాని అనుబంధ సంస్థ సామాజిక మంచ్ అధ్యక్షుడిగా పదిహేనేళ్లుగా ఉన్నట్లు తెలిపారు. షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ సలహాదారుడు, కేంద్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్ ప్రైజెస్ జన్ శిక్ష సంస్థాన్ బోర్డు సభ్యుడిగా, భాగ్యనగర్ బాడీ సమితి చైర్మన్‌గా కొనసాగుతున్నట్లు చెప్పారు.

చెంగిచెర్ల బాధితులకు న్యాయం చేయాలి

ఖైరతాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చెంగిచెర్లలో అమాయక పార్థీవాడ కుటుంబాల మహిళలపై జరిగిన దాడి అమానవీయమని, బాధితులకు వెంటనే న్యాయం జరిగేలా పోలీసులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం ఖైరతాబాద్ చౌరస్తా సమీపంలో బీజేపీ నేత శక్తి లాల్ హీరా ఆధ్వర్యంలో పార్థీవాడలకు చెందిన ప్రతినిధులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల ఉదాసీనత వల్ల ప్రభుత్వంపై భరోసా తగ్గే అవకాశం ఉంటుందని లాల్‌హీరా హెచ్చరించారు. మహేందర్, అనిల్ రితిక్, సూర్య, మాణిక్యం ఉన్నారు.